## క్లుప్తంగా

### ఆయుర్వేద వైద్యంతో వ్యాధులు దూరం



కొణకంచి(పెనుగంచిప్రోలు):ఆయుర్వేద వైద్యంతో అనేక దీర్ఘకాలిక వ్యాధులు కూడా దూరమవు వైద్యాధికారి కె.వాణి తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో కొణకంచిలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మన ఇంటిచుట్టూ అనేక ఆయుర్వేద మొక్కలు ఉన్నాయన్నారు. ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వైభవంగా పవిత్రోత్సవాలు



నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసి యున్న సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం విష్వక్సేనారాధన, రక్షాబంధన పూజ, పంచగవ్యారాధన, వాస్తుహోమం, అకల్మష హోమం, పవిత్ర ప్రతిష్ఠ, అగ్నిప్రతిష్ఠలతోపాటు కుంభ ఆవాహన, పవిత్ర శయనాధివాసం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఫణికుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

# భారీగా ఇసుక దోపిడీ

- గ్రామాల్లో ఇష్టారాజ్యంగా ఇసుక డంపింగ్
- పగలు ట్రాక్టర్లు..రాత్రి లారీలతో అక్రమంగా తరలింపు
- ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఎంపీ అనుచరులు
- ఇసుకదందాలో కీలకంగా మారిన షాడో ఎమ్మెల్యే
- నేతల ఇసుక డంప్‌ల జోలికి వెళ్లని అధికారులు, పోలీసులు



గండేపల్లిలో సోమవారం ఓచోటా నాయకుడి ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కంచికచర్ల: ఖాళీస్థలాలు..పంటపొలాలు..వాగుల ఒడ్డులు..కావేవి ఇసుక డంప్‌లకు అనర్హం అన్నట్లు తయారైంది టీడీపీ కూటమి పాలనలో ఇసుక పాలసీ పరిస్థితి. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఇసుక రీచ్‌ల వద్ద నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లవచ్చన్న నిబంధనను అడ్డుపెట్టుకుని అధికార టీడీపీ నాయకులు వారంపదిరోజులుగా భారీస్థాయిలో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. పంట పొలాలు, గ్రామాల్లోని ఖాళీప్రదేశాల్లో పెద్దఎత్తున ఇసుకను నిల్వ చేశారు. భారీస్థాయిలో ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసి రాత్రికాగానే లారీల ద్వారా విజయవాడతోపాటు తెలంగాణ ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### కీలకంగా వ్యవహరిస్తున్న షాడో ఎమ్మెల్యే...

నందిగామ నియోజకవర్గంలో ఇసుకదందా జోరుగా సాగుతోంది. కంచికచర్ల మండలంలో లభించే ఇసుక నాణ్యమైనదిగా పేరొందింది. దీంతో ఈ ఇసుకకు డిమాండ్ అధికం. కంచికచర్ల మండలానికి ఓవైపు మునేరు, మరోవైపు కృష్ణానది ఉండటంతో ఇసుక దోపిడీదారులు కంచికచర్లను కేంద్రంగా చేసుకుని ఇసుక అక్రమరవాణా సాగిస్తున్నారు. ఎంపీ అనుచరులుగా చెప్పుకుంటున్న పలువురు ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న కంచికచర్ల మండలానికి చెందిన ఓ ఎంపీటీసీ సభ్యుడు ఈ ఇసుక అక్రమరవాణాను యథేచ్ఛగా సాగిస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. ఈయన కీసర స్టాక్‌పాయింట్‌లో నిల్వచేసిన ఇసుకలో భారీమొత్తంలో ఇసుకను తరలించి సొమ్ముచేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతుండగా, అధికారులు సైతం స్టాక్‌పాయింట్ ఇసుక స్వాహా వ్యవహారంపై నోరుమెదపకపోవడం గమనార్హం.

### అక్రమరవాణాను అడ్డుకునే నాథుడేడి..

ఈ ఇసుక దోపిడీ వెనుక జిల్లా, నియోజకవర్గస్థాయి అధికార పార్టీ నాయకుల హస్తం ఉందనేది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం కంచికచర్ల మండలం



గండేపల్లిలో పోలీసులు పట్టించుకోని గ్రామనాయకుడికి సంబంధించిన ఇసుక డంప్

పెండ్యాల-1, పెండ్యాల-2లో మున్నేరులో ఇసుక ర్యాంపులో తవ్వకాలు సాగుతున్నాయి. ఆయా ఇసుక రీచ్‌లను దక్కించుకున్న అధికారపార్టీ నాయకులు సాయంత్రం చీకటిపడగానే నేరుగా రీచ్‌ల్లోకి టర్బో టిప్పర్లను తీసుకువెళ్లి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. వారంరోజుల కిందట కంచికచర్లకు చెందిన ఓ చోటానాయకుడు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అనుచరులమంటూ 100 టిప్పర్ల ఇసుకను రీచ్ నుంచి తరలించినట్లు సమాచారం. అదేరోజున అధికారపార్టీ నాయకుడు కీసర స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను అధికారుల అనుమతులు లేకుండా ఖాళీ చేశారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే సదరు నాయకుడిని కొంతమంది గ్రామస్తులు అడ్డుకోగా, పోలీసుల ద్వారా కేసులు పెట్టిస్తానని బెదిరించడంతో చేసేదేమిలేక గ్రామస్తులు మిన్నకుండిపోయారు. ఈ ఒక్క స్టాక్ పాయింట్ నుంచి ఈ నాలుగున్నర నెలల్లో కోట్లాది రూపాయల ఇసుకను సదరు షాడో ఎమ్మెల్యే స్వాహా చేశారని అధికార పార్టీ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటుండం గమనార్హం.

### చోటామోటా నాయకులపై కేసులు...

ఇంతటి భారీస్థాయిలో ఇసుక దందా సాగుతున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పోలీస్‌శాఖలు తూతూమంత్రంగా తనిఖీలుచేస్తూ మమ అనిపిస్తున్నారు. టర్బో టిప్పర్లు, లారీలతో సాగుతున్న ఇసుక అక్రమ రవాణా వ్యవహారాన్ని చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు, సదరు షాడో ఎమ్మెల్యే సూచనల మేరకు ఆయాగ్రామాల్లో అధికార టీడీపీకి చెందిన చోటామోటా నాయకులు డంపింగ్ చేసిన ఇసుకను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తుండటం గమనార్హం. ఈ ఇసుక డంప్‌లను అడ్డుపెట్టుకుని..తన మాటవినని, తనకు వ్యతిరేకంగా పనిచేసే నాయకులే టార్గెట్‌గా సదరు షాడో ఎమ్మెల్యే వారిపై కేసులు నమోదయ్యేలా వ్యవహరిస్తున్నారని ఆపార్టీ కార్యకర్తల నుంచే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందుకు గండేపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గ్రామ ముఖ్యనాయకుడి ఇసుక డంప్‌ను చూసిచూడనట్లు వదిలేసిన పోలీసులు, అదే గ్రామంలో మరో చోటా నాయకుడికి చెందిన ఇసుకను గుర్తించి కేసు నమోదు చేయడమే నిదర్శనం. ఇలా నిత్యం వేలాది టన్నుల ఇసుక కంచికచర్ల మండలం నుంచి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్తోంది. ఇకనైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసుశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### బాలల చట్టాలపై అవగాహన



నందిగామటౌన్: బాలల చట్టాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌సీఆర్‌సీ క్లబ్‌లో సోమవారం బాలల చట్టాలపై అవగాహన సదస్సు, సామర్థ్యం పెంపుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగనవాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు బలవర్ధక ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నాణ్యమైన బాలామృతాన్ని తిరిగి రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బాలల చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు కరుణ, కరీమా, ప్రభావతి, వెంకటరావమ్మ, తారాభి, శ్రీలత, శ్రీదేవి, ఇషారత్, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నందిగామ టౌన్:స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం జరుగుతుందని కమిషనర్ రమణ బాబు సోమవారం తెలిపారు. ఇన్‌చార్జి చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మీ అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు నిర్వహించే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

# తెల్లబోయిన బంగారం



మంగొల్లులో తేమశాతం అధికంగా ఉండటంతో ఆరబెట్టిన పత్తి

- రూ.5వేలకు మించని క్వింటా పత్తిధర
- రైతుకు దక్కని గిట్టుబాటు ధర
- పెట్టుబడులు కూడా రాని వైనం



**పత్తిలో తగ్గిన దిగుబడులు**

**భారీవర్షాలకు దెబ్బతిన్న పత్తిపంట**

**ధరలు కూడా అంతంతమాత్రమే**

వత్సవాయి : తెల్ల బంగారంగా ఖ్యాతిగాంచిన పత్తికి సరైన రేటు లేక తెల్లబోతోంది. ఎప్పుడూ అక్టోబర్, నవంబర్ నెలల్లో పత్తి పంట రైతుల చేతికి వస్తుంది. చేతికి వచ్చిన పత్తిని రైతుల అమ్ముకుని, మిర్చి పంటలకు పెట్టుబడులు పెట్టుకునేవారు. కానీ ప్రస్తుతం అ పరిస్థితులు కనపడడం లేదు. ఎక్కడో అరకొరగా పత్తి వస్తోంది. ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితులు కనపడడం లేదు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఈ ఏడాది 30వేల ఎకరాల్లో



పత్తిని తీస్తున్న కూలీలు

పత్తి పంటను సాగుచేశారు. పత్తి పంట పూత, పిందె దశలో ఉన్నప్పుడు పడిన వర్షాలకు మొదట పడిన పూత, పిందె రాలిపోయింది. దీంతో కాపు కూడా సక్రమంగా కాయలేదు. దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి.

### గిట్టుబాటు కాదని రైతుల ఆవేదన

మార్కెట్లో పత్తి ధర కూడా ఆశించిన విధంగా లేదు. క్వింటాకు రూ 5వేల నుంచి రూ. 5,500 మాత్రమే రైతు చేతికి అందుతోంది. ఈ ధర గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మండల రైతులు పత్తి తీతలు మొదలు పెట్టి, మొదటిగా వచ్చిన పత్తిని తీస్తున్నారు. రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోళ్ల కోసం గతంలో ప్రభుత్వం మార్కెట్లో యార్డుల్లో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు జరిపేవారు. కానీ ప్రస్తుతం ఎక్కడా సీసీఐ కేంద్రాలు కనిపించడం లేదు. దీంతో రైతులు ఇళ్ల వద్దనే దళారులకు పత్తిని అమ్ముకుంటున్నారు. ఉన్న కాస్తా పత్తి మార్కెట్లో మంచి ధరకు అమ్ముడు కావాలంటే రైతులు పత్తితీతలో జాగ్రత్తలు వహించి నాణ్యత తగ్గకుండా చూసుకుంటే సరిపోతుందని మండల వ్యవసాయాధికారి వి.రవి కుమార్ చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

### పత్తి తీతలో పాటించాల్సిన జాగ్రత్తలు..

- రైతులు కూలీలతో పత్తిని తీయించేటప్పుడు ఎండిన ఆకులు పత్తిలో కలవకుండా ఉండేలా చూసుకోవాలి.
- పొలంలో బాగా పగిలిన పత్తినే తీయాలి. కాయలుగా ఉన్న పత్తిని కూడా కలిపి తీస్తే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతారు.
- తీసిన పత్తిని ఆరబెట్టి నిల్వచేసుకోవాలి. మంచు ఉన్న సమయంలో తీసిన పత్తిని వెంటనే ఆరబెట్టాలి. అటువంటి పత్తిని వెంటనే గుట్టగా పెడితే నల్లబడే అవకాశం ఎక్కువగా ఉంది.
- పత్తికి తేమ తగలకుండా గాలి, వెలుతురు తగిలేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాపారులు పత్తి నాణ్యతను పింజను బట్టి కొలుస్తారు. పింజ పొడువు, గట్టిదనం, విత్తనంలో తేమ శాతం చూసుకుంటారు. పింజ పొడువు ఉన్న పత్తికి మంచి ధర ఉంటుంది.
- ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో తీసిన పత్తిలో ఎండిన ఆకులు పడి పత్తిలో నలక శాతం ఉంటుంది. అటువంటి నలకలు లేకుండా చూసుకోవాలి.
- తీసిన పత్తిలో తేమశాతం సరిపోను ఉన్నట్లయితే ఇళ్ల వద్ద నీడ ఉన్న ప్రదేశంలో మండె వేసుకోవాలి. దీంతో పత్తి గింజ గట్టిపడి తూకం వస్తుంది.

### అధిక వర్షాలతో తీరని నష్టం...



సెప్టెంబర్ మాసం మొదటివారంలో పదిరోజులు పాటు ఎడతెరపి లేకుండా పడిన వర్షాలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. అప్పటివరకు ఉన్న పూత, పిందె మొత్తం అధికతేమ శాతం కారణంగా రాలిపోయింది. దీంతో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల మాత్రమే దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. దీంతో పత్తి రైతుకు తీరని నష్టం వాటిల్లింది.

– చావా కృష్ణారావు, ఇందుగపల్లి

### పగిలిన పత్తినే తీయాలి..



పత్తి మొక్కల నుంచి బాగా పగిలిన పత్తినే తీయాలి. సగం పగిలిన కాయల నుంచి తీసే పత్తికి నాణ్యత తగ్గి ధర కూడా తగ్గిపోతుంది. పత్తి తొనలు ఎక్కువగా ఉన్న పత్తిని గుడ్డి పత్తి అంటారు. అటువంటి దానిని వేరుచేయాలి. పత్తిలో నలక లేకుండా ఆరుదలగా ఉంటే మంచి ధర లభిస్తుంది.

– వి రవికుమార్, ఏవో

## ప్రమాదాలకు నిలయాలు ఈ మూలమలుపులు



కె.అగ్రహారం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రోడ్డులోని ప్రమాదకరమైన మూలమలుపు



వేదాద్రి-రావిరాల గ్రామాల మధ్య ఉన్న ప్రమాదకరమైన మూలమలుపు

జగ్గయ్యపేట : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో ఉన్న మూలమలుపుల వద్ద కనీస ప్రమాద సూచికల బోర్డులు కూడా లేకపోవడంతో తరచూ ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించేందుకు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంగా జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల- అగ్రహారం రోడ్డు, బలుసుపాడు-అన్నవరం రోడ్డు, జయంతిపురం-ధర్మవరపుపాడు తండా రోడ్డు, రావిరాల-వేదాద్రిలకు వెళ్లే రోడ్లలోని మూలమలుపులు ప్రమాదభరితంగా మారాయి. నిత్యం ఈరోడ్లలో వందలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గ్రామాల సమీప ప్రాంతాలలోనే పరిశ్రమలు ఉండటంతో నిత్యం బొగ్గు, సిమెంటు లారీలు విపరీతమైన వేగంతో రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపుల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ముఖ్యంగా కె.అగ్రహారం స్టీల్‌ప్లాంట్ వద్ద ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇక్కడ ఓఆటో- లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా రోడ్లలోని మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

నందిగామటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటియు నాయకుడు కటారపు గోపాల్ విమర్శించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శాఖలో పని చేస్తున్న కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు, సెలవులు, రక్షణ పరికరాలతో పాటు కనీస వసతులు కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. అంతే కాకుండా పట్టణ విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచకపోవడంతో కార్మికులు పనిభారంతో అల్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కరి వెంకటేశ్వరరావు, హుసేన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గరికపాటి ప్రసాద్, పిచ్చయ్య, రుతమ్మ, తదితరులు పాల్గొన్నారు.




మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

### నేడు బలుసుపాడులో గ్రామసభ

జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం రీసర్వే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామసభ ప్రారంభమవుతుందని, రైతులు హాజరై ఆయా రెవెన్యూ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని సూచించారు.

## నూరుశాతం పనిదినాలు కల్పించాలని ఆదేశం

వీరులపాడు: ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉపాధి హామీ పథకం కూలీలకు నూరుశాతం పనిదినాలు కల్పించాలని ఏపీఓ జనార్దన్ ఆదేశించారు. మండలంలోని వీఅన్నవరం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.12కోట్ల విలువ చేసే పనులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టినట్లు తెలిపారు. రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం పనిదినాలు, వేతనాలు, తదితర వివరాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ముల వరబాబు, గ్రామకార్యదర్శి రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నేడు జుజ్జూరులో ప్రజావేదిక...**

సామాజిక తనిఖీ గ్రామసభల్లో భాగంగా మండలంలోని జుజ్జూరులో ఉపాధి పనులకు సంబంధించి మంగళవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ తెలిపారు.

### ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



జగ్గయ్యపేట అర్బన్: ఎల్ఐసీ యాజమాన్యం తన నిరంకుశ విధానాలను విడనాడాలంటూ ఆలిండియా యూనియన్ నాయకుల పిలుపు మేరకు ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఎల్ఐసీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పాలసీలపై బోనస్‌ను పెంచాలని కోరారు. ఏజెంట్ల డిమాండ్లను ఎల్ఐసీ యాజమాన్యం అంగీకరించేంత వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎం.కొండయ్య, సెక్రటరీ ఎ.సైదులు, ట్రెజరర్ టి.నరేంద్రకుమార్, జోనల్ ఈసీ మెంబర్ పీసీ.వెంగళరావు, డివిజన్ జాయింట్ సెక్రటరీ జి.మురళీకృష్ణ, ఏజెంట్లు పాల్గొన్నారు.

### మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వత్సవాయి: మిర్చి పంటలో తామరపురుగుతో ఇబ్బందులు తలెత్తకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. వాతావరణంలో తేమశాతం ఎక్కువకావడంతోపాటు పలుమార్పులు చోటుచేసుకుంటుండటంతో మిర్చి పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఉంది. మిర్చి మొక్కలకు ఉన్న పూతలలో ఐదుశాతం కంటే ఎక్కువశాతం తామరపురుగులు ఉన్నట్లయితే వెంటనే పురుగుమందులను పిచికారీ చేయాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. తామరపురుగు నివారణకు మొదటగా డెలిగేట్, వేపనూనె కలిపి పిచికారీ చేయాలని, నాలుగు రోజులు తరువాత తగ్గకపోతే వెంటనే జంప్‌తోపాటు వేపనూను పట్టించాలన్నారు. అదికాకుంటే ప్రైడ్, వేపనూనెను పిచికారీ చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారిణి వర్ధినీకుమారి సూచించారు. ఐదు రోజులకు ఒకసారి ఇలా చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పచ్చఅట్టలను కూడా మిర్చి తోటలలో పెట్టుకుంటే వాటికి ఉన్న జిగురుకు తామరపురుగులతోపాటు దోమ కూడా జిగురుకు అంటుకుపోతుందన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో పచ్చఅట్టలు సిద్ధంగా ఉన్నాయని, కావలసిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని వర్ధినికుమారి సూచించారు.